

అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | శుక్రవారం 24 నవంబర్ 2023 | www.navatelangana.com

రేపు కామారెడ్డికి మోడీ

- బీజేపీ తరపున ప్రచారం
- సీఎస్ఐ గ్రౌండ్‌లో బహిరంగ సభకు ఏర్పాట్లు
- భారీ బందోబస్తు



2లో...

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడి

- నవతెలంగాణ కథనానికి స్పందన
- పలువురిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ శాఖ



8లో...

చెమటోడ్చాల్సిందే..

ప్రధాన పార్టీల అభ్యర్థుల నడుమ టగ్‌ఆఫ్ వార్


- 9 నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి
- అంతుచిక్కని ఓటర్ నాడి
- అయోమయంలో అభ్యర్థులు
- ప్రచారానికి ఇంకా మూడురోజులే గడువు
- ప్రచార సరళి మారుస్తున్న పార్టీలు

ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య టగ్‌ఆఫ్ వార్ కొనసాగుతుంది. గెలుపోటములపై ఓ అంచనా రాని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వా నేనా అన్నట్టుగా పోటీ నెలకొంది. ఎవరు గెలిచినా.. మెజార్టీ మాత్రం చాలా తక్కువ వచ్చే పరిస్థితి నెలకొంది. పోలింగ్‌కు మరో మూడు రోజులు మాత్రమే సమయం ఉండటంతో అభ్యర్థులు ప్రచార సరళిని ముమ్మరం చేస్తున్నారు.

-నవతెలంగాణ, నిజామాబాద్ డెస్క్

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 నియోజకవర్గాలకు గాను 8 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పాగా వేసింది. ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ నుంచి జాజాల సురేందర్ గెలిచిన తర్వాత బీఆర్ఎస్‌లో చేరడంతో మొత్తం 9 స్థానాల్లోనూ బీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా అవతరించింది. అయితే ఈసారి బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌తో తీవ్ర పోటీ నెలకొంది. ప్రతి నియోజకవర్గంలోనూ టగ్గ్‌ఆఫ్ వార్ కొనసాగుతుంది.

వివరాలు 2 లో...



నాయకులకు జేజేలు.. కార్యకర్తలపై కేసులు

- గలాట ఘటనలో మూడు పార్టీల పలువురు కార్యకర్తలపై కేసు నమోదు : సీపీ కల్మేశ్వర్



కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు(ఫైల్)

నవతెలంగాణ-బోధన్

ఎన్నికల ప్రచారంలో చోటుచేసుకున్న ఘర్షణలో మూడు పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలపై కేసు నమోదు అయింది. అయితే నాయకులు జేజేలు కొట్టించుకుంటుండగా... కార్యకర్తలపై కేసులు నమోదు అవుతుండటం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే..

ఎడపల్లి మండలంలో బుధవారం జరిగిన దాడి, ఘర్షణ ఘటనలో 3 ప్రధాన పార్టీలకు చెందిన వారిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్టు జిల్లా పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. ఘటనా వివరాలు గురువారమిక్కడ వెల్లడించారు. సాటాపూర్ గేట్ వద్ద పండరీపూర్ టీ హోటల్లో 3 గుర్తింపు పొందిన పార్టీలకు చెందిన వారు మూడు గ్రూపులుగా ఏర్పడి గలాట చేసుకొన్న క్రమంలో ఒక వ్యక్తికి గాయ మయిందని , మిగితా వారికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు ఎంత నచ్చచెప్పిన వినలేని సందర్భంలో లారీచార్జీ చేసి, మూడు గ్రూపులపై 4 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

ఈ నెల 22వ తేదిన బోధన్ ఎమ్.ఎల్.ఎ మహ్మద్ షకీల్ ఆమేర్ 8 గ్రామాలలో (అంబెం, ఎ.ఆర్.పి క్యాంప్, బ్రహ్మణపల్లి, జైతాపూర్, ఎమ్.ఎస్ ఫారం, ఒడ్డెపల్లి, ధర్మారం, జమ్లం) ప్రచార కార్యక్రమాలు నిర్వహించారని, ఆ గ్రామాలకు వెళ్లినప్పుడు అక్కడ ఉన్న యువకులు, మహిళలు ఎమ్మెల్యేని ప్రశ్నించడానికి గుమిగుడిన సందర్భంలో వేరే పార్టీకి చెందిన వారు వచ్చి ఒకరికొకరు తోసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎక్కడ కూడా ఎమ్.ఎల్.ఎ షకీల్ పై దాడి జరుగలేదని తెలిపారు. సాటాపూర్ క్రాస్ రోడ్డులో పండరీపూర్ హోటల్లో మూడు పార్టీలకు మిగతా 2లో...

అధికారుల పర్యవేక్షణ ఉంటే బాలుడి ప్రాణం నిలిచేది

- ఆర్మూర్ కోర్ట్ సబ్ జడ్జి నసీమ్ సుల్తానా
- బాలుడి మృతి ఘటనపై సుమోటుగా కేసు స్వీకరించిన ఆర్మూర్ కోర్టు



విచారణ చేపట్టిన సబ్ జడ్జి నసీమ్ సుల్తానా

నవతెలంగాణ-బాల్కొండ

ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులు దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారని బాలుడి మృతి తీవ్రంగా కలిచివేసిందని ఆర్మూర్ కోర్ట్ సబ్ జర్జ్ నసీమ్ సుల్తానా ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ శాఖ, వైద్య శాఖ సరైన పర్యవేక్షణ ఉంటే ఇలాంటి అమానుష ఘటన జరిగేది కాదని తెలిపారు. బాల్కొండ మండలం ఇత్వార్ పేట్ గ్రామానికి చెందిన ఇటుక బట్టిలో కూలిగా చేస్తున్న నరేష్, పద్మ దంపతుల కుమారుడు చందు (5) అనారోగ్యంతో గత కొన్ని రోజులుగా ఎలాంటి ఆహార పదార్థాలను తీసుకోకపోవటంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఇదే విషయం ఆకలి, అనారోగ్యంతో చనిపోయాడని పత్రికలలో ప్రచురితమైన వార్తను చూసి జిల్లా జడ్జి ఈ కేసును సుమోటగా తీసుకొని విచారణ నిమిత్తం ఆర్మూర్ సబ్ జడ్జి నసీమ్ సుల్తానను ఇటుక బట్టిని సందర్శించి రిపోర్టు పంపాలని సూచించారు. గురువారం ఇటుక బట్టిని సందర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగతా 2లో...

చెమటోడ్చాల్సిందే..

- ప్రధాన పార్టీల అభ్యర్థుల నడుమ టగ్‌ఆఫ్ వార్

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్



ఆర్మూర్‌లో బీఆర్ఎస్ నుంచి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి వినయ్ కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి పైడి రాకేశ్‌రెడ్డి తలపడుతున్నారు. ఇక్కడ ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. గెలుపుపై ఓ పట్టాన అంచనా రావట్లేదు. అభివృద్ధి పనులపై జీవన్‌రెడ్డి దీమాగా ఉన్నా.. వినయ్‌కుమార్‌రెడ్డికి సానుభూతిని నమ్ముకు న్నారు. ఇక బీజేపీ అభ్యర్థి.. తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను ప్రధానంగా ప్రచారంలో వెల్లడిస్తున్నారు. దీంతో ఎవరికి వారు గెలుపుపై దీమాగా ఉన్నారు.

ఇక బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్, కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నుంచి వడ్డీ మోహన్‌రెడ్డి ప్రధానంగా బరిలో నిలిచారు. అయితే ప్రచారంలో ఎమ్మెల్యే మీద స్థానికులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ అడ్డుకుంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్రత్యర్థులు ఈ అంశాన్ని ప్రధాన అస్త్రంగా మలుచుకొని ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

నిజామాబాద్ అర్బన్‌లో త్రిముఖ పోటీ నెలకొంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే బిగాల, కాంగ్రెస్ నుంచి షబ్బీర్‌అలీ, బీజేపీ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త గెలుపు కోసం ముమ్మరంగా ప్రచారం చేపడు తున్నారు. గల్లీగల్లీల్లో తిరుగుతూ తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. షబ్బీర్‌అలీ పోటీ చేస్తుండ టంతో ఇరు పార్టీల అభ్యర్థులకు మైనార్టీల ఓట్లు తగ్గే అవకాశం ఉంది.

ఇక బాల్కొండలో సైతం ఎవరి దీమా వారే వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి మంత్రి వేములతో పాటు కాంగ్రెస్ నుంచి ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి అన్నపూర్ణమ్మ పోటీ పడుతున్నారు. వేముల సంక్షేమ పథకాలతో పాటు స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనులను నమ్ముకోగా.. ముత్యాల సునీల్ కుమార్.. తాను చేపట్టిన సహాయ కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన ఈరవత్రి అనిల్‌తో పాటు మానాల మోహన్‌రెడ్డి సైతం కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

నిజామాబాద్ రూరల్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మధ్య పోరు రసవత్తరంగా మారనుంది. సరళికరణాలు ఎప్పటికప్పుడు మారుతుండటంతో బాజిరెడ్డి గోవర్ధన్, భూపతిరెడ్డి గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రచార సరళిని మార్చుతూ ప్రజల్లోకి చొచ్చుకొని వెళ్తున్నారు.

కామారెడ్డి నియోజకవర్గంపై రాష్ట్ర వ్యాప్తంగా ఫోకస్ నెలకొంది. ఇక్కడి నుంచి ఇటు కేసీఆర్ అటు రేవంత్‌రెడ్డి పోటీ చేస్తుండటంతో సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఇద్దరి అభ్యర్థులపై సైతం పలువురు బాహాటంగానే వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఇక్కడే ఎక్కువగా 39 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. చాపకింద నీరులా బీజేపీ అభ్యర్థి వెంకట రమణారెడ్డి ప్రచారం చేపడుతున్నారు. రేపు మోడీ ప్రచారాన్ని నమ్ముకున్నారు.

ఎల్లారెడ్డిలో జాజాల సురేందర్, మదన్ మోహన్ రావు మధ్య వార్ నెలకొంది. కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో బీజేపీలో వడ్డేపల్లి సుభాశ్‌రెడ్డి చేరినా.. ఆయన అనుచరుల్లో పలువురు కాంగ్రెస్‌నే అట్టిపెట్టు కొని ఉన్నారు. దీంతో బీఆర్ఎస్-కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. అభివృద్ధిని మరింత విస్తృతం చేయనున్నట్టు జాజాల ప్రకటిస్తుండగా.. రూపాయి జీతం తీసు కుంటూ మిగతా డబ్బులతో ఇండ్లు కట్టిస్తా నని మదన్‌మోహన్ ప్రచారం చేస్తున్నారు. కమీషన్లు తీసుకోకుండా పనులు చేయిస్తా అంటూ బాండ్ రాసిస్తా అని ప్రచారం చేస్తున్నారు.

బాన్సువాడలో వార్ వన్‌సైడ్ అని అంతా భావిస్తున్నా.. ఇక్కడా పోటీ తప్పడం లేదు. ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచారు. లోకల్ నాన్ లోకల్ అంశాలు ప్రధానంగా ప్రచార అస్త్రాలుగా మలుచుకుంటూ డబుల్‌బెడ్ రూం ఇండ్లు, ఇది వరకు చేపట్టిన అభివృద్ధి పనులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఓటర్లకు వివరిస్తున్నారు. ఇక బీజేపీ నుంచి యెండల లక్ష్మీనారాయణ పోటీ చేస్తున్నారు.

జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి హాట్రిక్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేతో పాటు కాంగ్రెస్ నుంచి లక్ష్మికాంతరావు, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అరుణతారా బరిలో దిగారు. స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనులను షిండే నమ్ముకోగా.. ఏండ్లుగా నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. అయితే గెలుపుపై ఎవరి దీమా వారు వ్యక్తం చేస్తున్నా.. పోలింగ్ ముగిసి ఫలితాలు తేలే వరకూ తేలేలా లేదు. గెలుపు కోసం అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

ఇలా ప్రతినియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో గెలుపు నల్లేరుమీద నడక అయ్యే అవకాశం లేకుండా పోయింది. చాలా తక్కువ ఓట్ల తేడాతో గెలుపోటములు ఉండే అవకాశం ఉంది.

రేపు కామారెడ్డికి మోడీ

- బీజేపీ తరఫున ప్రచారం

నవతెలంగాణ-కామారెడ్డి

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోడీ రేపు (శనివారం) కామారెడ్డికి రానున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఉద్దండులు బీఆర్ఎస్ నుంచి కేసీఆర్‌తో పాటు కాంగ్రెస్ నుంచి రేవంత్‌రెడ్డి బరిలో నిలిచిన విషయం తెలిసిందే. అయితే బీజేపీ నుంచి వెంకటరమణారెడ్డి పోటీ పడుతుండటంతో ఆయనకు మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు మోడీ రానున్నట్టు బీజేపీ పార్టీ నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సిఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో సభ నిర్వహించినట్లు వారు ఆ ప్రకటన తెలిపారు. మోడీ పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు చేపట్టారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి



భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన అన్నారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాడ్వాయి మండలం సంతాయిపేట గ్రామానికి చెందిన మ్యాదరి భాస్కర్ (33).. రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన అనితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్యలో మనస్పర్థాలు వచ్చి, అనిత తల్లి గారి ఇంటికి వచ్చేసింది. తిరిగి కాపురానికి రావాలని గత నెల 3వ తేదీన భాస్కర్ అన్నారం వచ్చాడు. అనిత కాపురానికి రాను అని చెప్పటంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి విషయాన్ని తల్లికి చెప్పాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై సుధాకర్ తెలిపారు.

ఓటమి భయంతోనే కేసీఆర్ పోటీ

ఎంపీ ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-గాంధారి

గజ్వేల్‌లో ఓటమి భయంతోనే కేసీఆర్ కామారెడ్డిలో సైతం కేసీఆర్ పోటీ చేస్తున్నారని నిజామాబాద్ ఎంపీ అరవింద్ ఆరోపించారు. గాంధారి మండల కేంద్రంలో గురువారం రోడ్‌షో నిర్వహించారు. కేసీఆర్ పది సంవత్సరాల్లో తెలంగాణకు చేసింది ఏమీ లేదని రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ బాణాల లక్ష్మారెడ్డి, మండల బిజెపి అధ్యక్షుడు చీమల వారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నాయకులకు జేజేలు.. కార్యకర్తలపై కేసులు

-మొదటిపేజీ తరువాయి

చెందిన కార్యకర్తలు వాగ్వివాదము చేసుకొని ఘర్షణపడినట్టు పేర్కొన్నారు. ఈ ఘర్షణ తర్వాత వారి పార్టీకి చెందిన వారిని పిలిపించుకొని అనుమతి లేకుండా అక్రమంగా సమావేశమయి ప్రజలకు అసౌకర్యం కలిగించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని, దాంతో మూడు పార్టీలకు చెందిన కార్యకర్తల పై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కావున ఆయా పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రచారం చేసుకోడానికి తప్పకుండా అనుమతి తీసుకోవాలని సూచించారు.

అధికారుల పర్యవేక్షణ ఉంటే బాలుడి ప్రాణం నిలిచేది

-మొదటిపేజీ తరువాయి

బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ చేశారు. ఇటుక బట్టి యజమానిని లైసెన్స్, మైనింగ్, కూలీలకు జీతాలు, వంటి విషయాలపై ఆరా తీశారు. కూలీలు నివాసం ఉంటున్న ఇండ్లకు తలుపులు లేకపోవడం, వారికి నిత్యావసర సరుకులు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు. లేబర్ శాఖ, వైద్య శాఖ, సరైన పర్యవేక్షణ ఉంటే ఇలాంటి అమానుష ఘటన జరిగేది కాదని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పల్నాటి యోహాన్ కు కూలీలకు రేషన్ బియ్యం వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఘటనపై జిల్లా జడ్జికి నివేదిక పంపిస్తామని ఆమె మీడియాకు తెలిపారు.

మస్కూరి వ్యవస్థను మార్చడం కుట్రపూరితం

- ఇస్సాదారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు నక్క హరీశ్

నవతెలంగాణ-కామారెడ్డి

సుంకరి (మస్కూరి) వ్యవస్థ ఇప్పటిది కాదని నైజాం కాలం నుంచి వస్తున్న ఈ వ్యవస్థను కేసీఆర్ మార్చడం కుట్రపూరిత చర్యగా భావిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర సుంకరి (మస్కూరి) ఇస్సాదారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు నక్క హరీశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరద సంపత్ కుమార్ లు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం బిఆర్ఎస్ తమకు అన్యాయం చేసిందని, సుంకరి (మస్కూరి)వ్యవస్థ పట్ల ఎలాంటి అవగాహన లేకుండా 81,85 జీవో తీసుకువచ్చి సుంకర వ్యవస్థను నిర్వీర్యం చేసి పట్టాదారులకే పట్టం కట్టారు. ఇది చాలా దారుణం అయిన చర్య. సుంకరి (మస్కూరి) వ్యవస్థ అనేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నైజాం కాలం నుంచి వస్తున్న వ్యవస్థ. మా తాతలు, ముత్తాతలు వారి ముత్తాతలు అప్పటి నుండి ఈ వ్యవస్థ మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వంలో కొనసాగుతుంది. ఇవి కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు కాదు అని కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా తీసేసి నిరుద్యోగులను చేసి రోడ్డుపైన నెట్టి వేయడం చాలా దౌర్భాగ్యమైన వ్యవస్థ. ప్రతిపక్షాలు ఏవైనా కాంగ్రెస్ గాని బీఎస్పీ గాని బిజెపి గాని మాకు మద్దతుగా ఉండి సుంకరి (మస్కూరి) ఓట బంద్ పాత పద్ధతి విధానాన్ని కొనసాగిస్తామనీ మాకు మాట, వాగ్దానం ఇస్తారో వారికే సుంకరి ఇస్సాదారుల మద్దతు ఉంటుందన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు విప్ పరామర్శ



పరామర్శిస్తున్న విప్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి అనారోగ్యం కారణంగా ఇటీవల కాలంలో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న విప్ గంప గోవర్ధన్ హనుమంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్య సమస్యకు గల కారణాలు తెలుసుకున్నారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీ రాజలింగం, సొసైటీ చైర్మన్ రాజా గౌడ్, ఏఎంసీ వాయిస్ చైర్మన్ రాజమౌళి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కార్మిక ఉద్యమానికి తీరని లోటు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి అయినా కామ్రేడ్ తోకల తిరుపతి బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం విప్లవ కార్మిక ఉద్యమానికి తీరని లోటు. ఐఎఫ్‌టి యు నిజామాబాద్ జిల్లా కార్యవర్గం నివాళులర్పించారు. నగరంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కామ్రేడ్ తిరుపతి కుటుంబ సభ్యులకు ప్రగఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ రాష్ట్ర నాయకులు ఎం మోహన్. మురళి ముల్లె హమాలి నాయకులు మల్లేష్ ఎల్లప్ప శంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలు

నవతెలంగాణ-ధర్పల్లి

సత్య సాయి బాబా 98 జయంతి వేడుకలను పురస్కరించుకొని గురువారం ధర్పల్లి సాయి సదన్ లో ధ్వజారోహణ, అష్టోత్తర నామాలు, పూజ, బాలవికాస్ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు, పల్లకి సేవ నిర్వహించారు. స్వాములు ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పారు. ఈ వేడుకల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో సత్య సాయి సేవ సమితి కన్వీనర్ శ్రీనివాస్, ప్రతినిధులు చిలుక శంకర్, మచ్చ బుచ్చన్న వాళ్ల కూడా గంగాధర్ శ్రీపాద్ నరేష్ సాయికుమార్, జిల్లా మహిళా యూత్ కోఆర్డినేటర్ వినీత, మంచి కంటి శోభ, కష్టవేణి, మంతెన లక్ష్మి, నవనీత, మమత, జ్యోతి శనిగరం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం గ్రామంలోని ఆర్యనగర్, ఎఫ్‌సిఐ, సంజీవ రెడ్డి నగర్ కాలనీల్లో ఈగ నర్సారెడ్డి ఆధ్వర్యంలో గంగాధర్, రమేష్, దేవేందర్, శ్యామసుందర్ రెడ్డి గురువారం ప్రచారం నిర్వహించారు. బాజిరెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని గడప గడపకూ కేసీఆర్ చేసినా అభివృద్ధి పనులు, పథకాలు, మ్యానిఫెస్టో గురించి వివరించారు. కారు గుర్తు కు ఓటు వేసి రూరల్ ఎంఎల్‌ఏగా బాజిరెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని ప్రచారం చేశారు. బాజిరెడ్డి మూడోసారి గెలిస్తే ఖచ్చితంగా మంత్రి పదవి వస్తుందని, ఇంకా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో గల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకులు గౌతమ్ సింగ్ గురువారం సందర్శించారు. ఓటింగ్ నిర్వహణకై పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కనీస సదుపాయాలైన టాయిలెట్స్, నీటి వసతి, ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం వంటివి అందుబాటులో ఉన్నాయా? లేవా? అన్నది గమనించారు. అన్ని వసతులు ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లకు వారి ఓటు వివరాలతో కూడిన స్లిప్పులు పూర్తి స్థాయిలో పంపిణీ చేశామని అధికారులు అబ్జర్వర్ దృష్టికి తెచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకట్ రావు ఉన్నారు.

చంద్రయాన్ -3 రాకెట్ నమూనా ఆవిష్కరణ



రాకెట్ నమూనాతో విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్‌లో గల నారాయణ పాఠశాల 8వ తరగతి విద్యార్థులు చంద్రయాన్ -3 కి సంభందించిన రాకెట్ నమూనా ను చాలా నైపుణ్యంతో తయారుచేశారని ప్రధానోపాధ్యాయులు రజని కుమారి తెలిపారు. నారాయణ విద్యాసంస్థల తెలంగాణ రాష్ట్ర జి.యం గోపాల్ రెడ్డి, నిజామాబాద్ జోన్ ఏజీయం శివాజీ పాటిల్ విద్యార్థుల సృజనాత్మకతను పొగుడుతూ ఇలాంటి నమూనా ఆవిష్కరణల ద్వారా భవిష్యత్తులో శాస్త్రవేత్తలు కావడానికి ఎంతగానో దోహదపడతాయని అభినందించారు. ఇందులో ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతగానో ఉందని హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యంలో యువత భాగస్వాములు కావాలి

- ఓటు వేయకపోతే పనికిరాని వాళ్లు రాజకీయాల్లోకి వస్తారు
- కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థినులతో కవిత సంభాషణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత క్రియాశీలక భాగస్వామ్యం కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఓటు వేయకపోతే పనికిరాని వాళ్లు రాజకీయాల్లోకి వస్తారని స్పష్టం చేశారు. ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కు ఉండదని, వ్యవస్థలు నిర్వీర్యమవుతాయని తెలిపారు. ఆరోపణలు చేసే ముందు రాజకీయ నాయకులు ఆలోచించాలని సూచించారు. ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉంటే దేశం అంత శక్తివంతంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జనార్ధన్ గార్డెన్ లో నిజామాబాద్‌లో కొత్తగా ఓటు హక్కు పొందిన కాలేజీ విద్యార్థినులతో కవిత సంభాషించారు. పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు జవాబునిచ్చారు. ఎన్నికలు అంటే ఎవరు గెలిస్తే ఏమిటన్న అభిప్రాయంలో ఉండవద్దని సూచించారు. సానుకూల దృక్పథంతో సామాజిక మాధ్యమాలను వాడాలని తెలిపారు. ప్రతీ రోజు వార్తాపత్రికలను చదవాలని, సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఓటు వేయకపోతే రాజకీయాల్లోకి పనికిరాని వాళ్లు, జ్ఞానం లేని వాళ్లు వస్తారని, తద్వారా వాళ్లు తీసుకునే నిర్ణయాలకు ప్రజలంతా ఇబ్బంది పడుతారన్నారు. అందులోనూ సరైన వాళ్లని ఎన్నుకోవాలని స్పష్టం చేశారు. ఓటు వేయకపోతే ప్రభుత్వాలను అడగడానికి హక్కు ఉండదని అభిప్రాయ పడ్డారు. ఓటు హక్కును వినియోగించు కోకపోతే వ్యవస్థలు నిర్వీర్యమవుతాయన్నారు. సినిమాల్లో రాజకీయ నాయకులను, పోలీసులను విలన్లుగా చూపిస్తున్నారని, వాటిని పట్టించుకోవద్దని చెప్పారు. ప్రపంచాన్ని వ్యాపారం ఆధిపత్యం చెలాయిస్తుందని ప్రస్తావించారు. అంత సైన్యం ఉన్న అమెరికా చైనాతో నేరుగా పోరాటం చేయడం లేదని, ఎందుకంటే చైనా నుంచి వచ్చే వస్తువులు అమెరికాకు రాకపోతే మొత్తం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఆగిపోయే పరిస్థితి ఉందని అన్నారు. అంటే అక్కడ ఆధిపత్యం వ్యాపారానిది ఉందా ? రాజకీయానిది ఉందా ? కాబట్టి వ్యాపారం వెనుక ఉన్న జియోపాలిటిక్స్‌ను అర్థం చేసుకోవాలి" అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. లక్ష కోట్ల మేర అవినీతి జరిగిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారని, మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 80 వేల కోట్లు అయితే రూ. లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఆరోపణ చేసే ముందు కనీసం ఆలోచించాలి కదా అని మండిపడ్డారు. హరితహారం కింద మొక్కలు నాటాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినప్పుడు అందరూ విమర్శించారని, కానీ ఇప్పుడు దేశంలోనే తెలంగాణలో 7 శాతానికిపైగా అటవీ విస్తరణ పెరిగిందని గుర్తు చేశారు. రాజకీయాల్లోకి వచ్చే మహిళలకు, యువతకు ఏం సందేశమిస్తాయని ఓ యువతి అడిగిన ప్రశ్నకు కవిత సమాధానమిస్తూ రాజకీయాలు అంత సులువు కాదని, కానీ రాజకీయ నాయకులుగా తీసుకునే ఒక నిర్ణయం కోట్ల మంది మంది జీవితాలను మార్చుతుందని అన్నారు. అన్ని చేస్తేనే ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. ప్రజల కోసం పనిచేయాలని చెప్పారు. కుటుంబ సభ్యుల మద్ధతు లేకపోతే మహిళలు రాజకీయాల్లోకి రావద్దని స్పష్టం చేశారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటున్నదని, స్వయం ఉపాధికి సహకారం, జిల్లాల్లో ఐటీ హబ్‌ల ఏర్పాటుపై యువతులు అడిగిన ప్రశ్నలకు కవిత స్పందిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా 2.3 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రానికి దాదాపు 22 వేల కంపెనీలు వచ్చాయని, దాని వల్ల 30 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వచ్చాయని, పరోక్షంగా మరో 30 లక్షల మందికి ఉపాధి కలిగిందని వివరించారు. స్వయం ఉపాధి కోసం కూడా స్టార్టప్ వంటివాటిని ప్రోత్సహిస్తున్నామని, ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని చెప్పారు. టీహబ్, టీ వర్క్స్ వంటివాటిని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. స్వయం ఉపాధికి ప్రభుత్వం చేయుతనిస్తున్నదని స్పష్టం చేశారు. ఎటువంటి హామీ లేకుండా రూ. 2 కోట్ల మేర రుణ సౌకర్యం కల్పిస్తోందని తెలిపారు. ఐటీ కంపెనీలను తీసుకురావడంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయని, యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్ధేశంతో అనేక సబ్సిడీలు ఇచ్చి జిల్లాల్లో ఐటీ హబ్‌లకు కంపెనీలను తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. జాబ్ మేళాలు కూడా నిర్వహిస్తున్నా మన్నారు. టీఎస్పీఎస్సీలో సాంకేతిక సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం ఏం చర్యలు చేపడుతుందని ఒక యువతి అడగగా రాష్ట్రంలో ఒకేఒక్కసారి పేపర్ లీక్ ఉదంతం జరిగిందని, వెంటనే 10 రోజుల్లో నిందితులను పట్టుకున్నామని, ఒక రాజకీయ పార్టీ ప్రమేయం ఉందని గుర్తించామని వివరించారు. రాజస్థాన్ లో 14 సార్లు పేపర్ లీక్ అయ్యిందని, గుజరాత్ లో 28 సార్లు లీక్ అయ్యాయని, ఇతర ప్రభుత్వాలతో పోల్చితే తెలంగాణ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. ఫలితాలు వచ్చిన తర్వాత కొంత మంది కోర్టుల్లో కేసులు వేయడం వల్ల కొన్ని ఉద్యోగాల భర్తీ వాయిదా పడ్డాయని, అది జరగకుండా చూడడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలని ఒక విద్యార్థిని ప్రశ్నించగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీ కొట్లాడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతీ రోజూ రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పనిచేస్తోందని, అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామమని . కాబట్టి కారు గుర్తుకు ఓటు వేయాలి అని కవిత బదులిచ్చారు. తొలిసారి ఓటు వేసినప్పటి అనుభవం చెప్పాలని ఒక విద్యార్థిని కోరగా మొదటి నుంచి తన తండ్రికే ఓటు వేశానని, చింతమడకలో తొలిసారి తన తల్లిదండ్రులతో కలిసి ఓటు వేశానని, అది ఎప్పటికీ మరిచిపోలేని అనుభవం అని చెప్పారు. అలాగే, అమెరికాలో తాను చదువుకున్న రోజుల్లో అనుభవాలను పంచుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో డీప్ ఫేక్ ఫోటోలు, వీడియోలు సృష్టిస్తున్నారని, వాటిని అడ్డుకోడానికి దేశంలో చట్టం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చట్టం కోసం తాను కూడా పోరాటం చేస్తానని ప్రకటించారు. వేధింపులు వస్తే షీటీమ్స్ కు ఫిర్యాదు చేయాలని, సైబర్ భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ఆయా రాష్ట్రాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు కావాలని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. దీనిపై చర్చ జరిగితేనే రాజకీయ వ్యవస్థలోనూ ఆలోచన వస్తుందన్నారు.

10వేల ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో గూండ్ల పెంటవ్వ అకాల మరణం చెందడంతో బాధిత కుటుంబానికి ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తనవంతుగా 10వేల రూపాయలను గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఒడ్డె రాజు, బద్ధం రోహిత్, మిద్దె శ్రీకాంత్, నీరడి మనోహర్,దామ నర్సయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.

జెంటిల్ కిడ్స్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థులు గురువారం ఫైర్ స్టేషన్ సందర్శించారు. అగ్ని ప్రమాదాలు జరిగి నప్పుడు ఎలా ఎదుర్కోవాలో అధికారుల ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు కరస్పాండెంట్ ప్రకాష్ గుజరాతి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తపాలా కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతాయి కొరియర్, స్పీడ్ పోస్ట్ ఎలా ఉంది.. పోస్ట్‌మాస్టర్ ఎవరు, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ ఎవరు అంటూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ఫైరింజన్ గురించి తెలుసుకున్న విద్యార్థులు

అభివృద్ధికి ఆమడ దూరంలో నిజామాబాద్ నగరం

● కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షబ్బీర్ అలీ ● కంఠేశ్వర్ కాలనీల్లో కార్నర్ మీటింగ్



ప్రచారంలో మాట్లాడుతున్న షబ్బీర్అలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ మంత్రి షబ్బీర్ అలీ కంఠేశ్వర్ వద్ద కార్నర్ మీటింగ్ గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ..నిజామాబాద్ నగరం అభివద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. అన్ని వసతులు కలిగిన పట్టణానికి మౌలిక సదుపాయాలు కల్పించలేక పోయారన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివద్ధి తప్ప ఎలాంటి అభివద్ధికి నోచుకోలేదని తెలిపారు. రోడ్లు డివైడర్లు నిర్మించి అభివద్ధి చేశామంటే అది హాస్యాస్పదమని అన్నారు. శాశ్వత అభివద్ధి చేయాలని, యువతకు ఉపాధి కల్పించాలని, విద్యా, వైద్య రంగాల్లో పట్టణం చాలా వెనుకబడి ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించండి నిజామాబాద్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. పేదల జీవితాలు బాగుపడే విధంగా మంచి ప్రణాళికలతో ముందుకు వెళ్దామని చెప్పారు. ఈ ప్రభుత్వ తీరుతో ప్రతి ఒక్కరూ నిరాశ నిస్పహతో ఉన్నారని, భారీగా పరిశ్రమలు తీసుకువచ్చిఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలతో ఇంటింటికి పోతామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతీ నెలా మహిళలకు రూ. 2500 అందిస్తామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. గహ జ్యోతి ద్వారా ప్రతీ ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తు కు ఓటు వేసి గెలిపిస్తేనే పేదల సమస్యలు పరిష్కారమవుతాయి అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోడు పట్టాలిచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే

● మీ భూములకు మీరే రాజు..
● ఆరోగ్యశ్రీ ద్వారా 15 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు.
● మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్

గిరిజనులకు పోడు పట్టాలిచ్చి తరతరాలకు భూమి భరోసా కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి, బీఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కారెపల్లి, తండాలు, దేవన్‌పల్లి, తండాలతోపాటు భీమ్గల్ పట్టణ కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాభై , అరవై ఏండ్లుగా పోడు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని గిరిజనులు అడిగినా గత పాలకులు కేసులు పెట్టారే కానీ పట్టాలివ్వలేదని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాకా ఇచ్చిన మాట ప్రకారం పోడు పట్టాలిచ్చామన్నారు. తద్వారా గిరిజనులను వారి భూములకు వారినే రాజులను చేశామన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి వారికి ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించామన్నారు. మట్టి రోడ్ల మీద ఎడ్ల బండ్లు కూడా కష్టమైన తండాల రోడ్లను డాంబర్ రోడ్లు వేయించి రోడ్ల సౌకర్యం కల్పించానన్నారు. తండాల్లో కూడా సందు సందుల్లో సీసీ రోడ్లు వేయించానన్నారు. తండాలకు సైతం ఇంత పెద్ద ఎత్తున పనులు చేసిన నేను.. మిమ్మల్ని చేతులెత్తి నమస్కరిస్తూ అడిగేది ఓటు మాత్రమేనన్నారు. జనవరిలో కొత్త పింఛన్లు, కొత్త బీడీ పీఎఫ్ వచ్చిన కార్మికులకు బీడీ పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు, మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఈ జనవరిలోనే అర్హులైన వారందరికీ అందిస్తామన్నారు. ఆరోగ్య శ్రీ కింద కాంగ్రెస్ హయాంలో రూ. 2 లక్షలకు మించి ఉచితంగా వైద్యం అందేది కాదన్నారు. కేసీఆర్ మొదటిసారి ముఖ్యమంత్రి కాగానే ఆరోగ్య శ్రీని ఐదు లక్షల రూపాయలకు పెంచి మూడోసారి ముఖ్యమంత్రి కాగానే రూ. 15 లక్షలకు పెంచడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

మంత్రి గెలుపు కోసం పాదయాత్ర, మొక్కులు చెల్లించిన మహిళలు

మండలంలోని దేవన్‌పల్లికి చెందిన మహిళలు సరోజ, జ్యోతి, సుజాత, లలిత దేవన్‌పల్లి నుంచి వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి మంత్రి వేముల గెలవాలని కోరుతూ కాలినడకన వెళ్లి పాదయాత్ర మొక్కులు చెల్లించారు. బుధవారం తిరిగివచ్చిన వారు తమ గ్రామం దేవన్‌పల్లికి గురువారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి వేములవాడ రాజేశుడి కంకణం కట్టి ప్రసాదం అందించారు. గ్రామాలు, తండాల్లో మంత్రికి ఘన స్వాగతం లభించింది.

మళ్లీ అక్కడ కేసీఆర్.. ఇక్కడ గోవన్నదే విజయం

● ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్
● ఎంపీపీ రమేష్ నాయక్
● ఇంటింటా ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎంపీపీ రమేష్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ఇందల్ వాయి మండలం లోని మాక్లూర్ తండా, గంగారాం తండా, స్టేషన్ తండాల్లో ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, ఎంపీపీ బదావత్ రమేష్ నాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు చిలువేరి దాస్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఈసారి నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశ పెట్టే పథకాలను ప్రజలకు, మహిళలకు వివరించారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పదేళ్లుగా రూరల్ నియోజకవర్గ అభివద్ధికి శాయశక్తులా కషి చేస్తున్నారని తెలిపారు. కారు గుర్తుకే ఓటు వేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ప్రతి గ్రామంలో గడపగడపకి ప్రతి ఇంట్లో కేసీఆర్ సంక్షేమ పథకం అమలైందని పేర్కొన్నారు. పనికిమాలిన ప్రతిపక్షాలు బిజెపి, కాంగ్రెస్ మాటలు నమ్మ వద్దన్నారు.ధరణి తీసేస్తామన్నా కాంగ్రెస్ కావాలా.. రైతులకు మేలు చేసే బీఆర్ఎస్ కావాలో ప్రజలు నిర్ణయించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూసని అంజయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు బిరిష్ శేట్టి , ఎంపిటిసి చింతల దాస్, శంకర్ గౌడ్, నర్సగౌడ్, కుమ్మరి శ్రీనివాస్, పండరి, బాల్‌రాం, మోజీరం, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

● ఈ ఎన్నికల్లో సత్తా చాటాలి
● మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి గోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగానే బీఆర్ఎస్ చూసిందని, వారి సంక్షేమానికి కృషి చేసిన దాఖలాలు లేవని, ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్ తమ సత్తా చాటాలని ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి గోపి అన్నారు. గురువారం ఇందల్ వాయి మండలంలోని అమ్సన్ పల్లి గ్రామంలో ముదిరాజ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మడి గోపి మాట్లాడుతూ గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లను గుర్తించక, ఎలాంటి సహాయ సహకారాలు అందించక అడుగడుగునా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులకు ఎమ్మెల్యే సీటు ఇవ్వకుండా మోసం చేశారని, ఎన్నో హామీలు ఇచ్చి మోచేతికి బెల్లం పెట్టినట్లు వివరించారు. ముదిరాజ్ లు ఏకమై ఈసారి జరిగే ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి మద్దతు ప్రకటించడమే కాకుండా భారీ సంఖ్యలో ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రకటించిన మెనిఫేస్టోలో ముదిరాజ్ కులస్తులకు బిసి-డి నుండి-ఎ లోకి మార్చుతామని ఇప్పటికే హామీ ఇచ్చినట్లు తెలిపారు. గత కొన్నాళ్లుగా ముదిరాజ్ కులస్తులు బిసి-ఎ లోకి తేవాలని పలుమార్లు డిమాండ్ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఇమ్మడి గోపి ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని విన్నవించారు. గ్రామంలో అందరూ ఏకమై ఏకగ్రీవంగా తీర్మానం చేయడం అబినందనమన్నారు. సమావేశంలో ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీని వెంటనే నియమించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో పిజి విద్యార్థులకు క్లాసులు నిర్వహించడానికి ఫాకల్టీనీ నియమించాలని డిమాండ్ చేస్తూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడీఎస్‌యూ) ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ, మొదటి, రెండవ పీజీ తరగతుల్లో ఎనిమిది లేదా తొమ్మిది పేపర్లు ఉంటాయన్నారు. కానీ ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే ఫ్యాకలీటని నియమించడం సిగ్గుచేటన్నారు. ప్రతి పేపర్‌కి ఒక ఫ్యాకల్టీ చొప్పున గతంలో ఉండేవారని, దానివల్ల విద్యార్థులకు మంచి బోధనతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఎనిమిది మంది బోధించాల్సిన పాఠ్యాంశాలను ఇద్దరు బోధించడం ద్వారా సబ్జెక్టు పరంగా నిష్ణాతులు లేకుండా విద్యార్థులకు అన్యాయం జరుగుతుంద న్నారు. వెంటనే ప్రతి పేపర్ కి ఒక ఫ్యాకల్టీ నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. నిజామబాద్ నగర నాయకులు నాగేష్, సలీం, విద్యార్థులు ప్రసన్న, అంకిత,ప్రత్యూష,శ్రీమణి, అముక్త, మౌనిక, సంధ్యా,నికిత, అంకిత గిరిజ, సుమయ్య, తమిల్, సారిక, మదిప, లిఖిత, శ్రియ,రాణి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని ఓల్డ్ బాయ్స్ హాస్టల్ ను గురువారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్.ఎం. యాదగిరి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్. ఎం. యాదగిరి విద్యార్థులు, హాస్టల్ సిబ్బందితో మాట్లాడి సంతప్తి వ్యక్తం చేశారు. పరిసరాలు, హ్యాండ్ వాష్ రూమ్, విద్యార్థులు భోజనం చేసే హాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు నచ్చే విధంగా వంటలు వండాలని సూచించారు. అనంతరం హాస్టల్లో విద్యార్థులతో కలసి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి, చీఫ్ వార్డెన్ మహేంద్ర ఐలేని డైరెక్టర్(పీఆర్ఓ) ఏ.పున్నయ్య భోజనం చేశారు.హాస్టల్ కేర్ టేకర్ దిగంబర్ చవాన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బొట్టుపెడుతూ.. ఓటు వేయాలని విజ్ఞప్తి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో ఎంపీపీ కుంచాల విమల రాజు దంపతులు ప్రతి ఇంటికి వెళ్లి బొట్టు పెడుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని విన్నవించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివద్ధి పనులను పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేస్తూ నిజామాబాద్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ను గెలిపించాలని కోరారు.

భారీ మెజారిటీతో గెలించండి

● ప్రచారంలో నీరజ రెడ్డి



నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలో గురువారం ఉదయం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి సతీమణి నీరజ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి ప్రశాంత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, ముప్కాల్ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ బ్రమ్మదండి సువర్ణ-లింగం, పార్టీ టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్, కో-అప్షన్ సభ్యులు మునిరోద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి వలసలు

● ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేష్ గుప్త



నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల సమక్షంలో 11వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉస్మాన్ ఖాన్ వెయ్యి మంది తో కలిసి గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నాయకులు వదూద్ అలీ. వలి ఉద్దీన్ చేరారు. కార్యక్రమంలో సూదం రవి చందర్, సత్య ప్రకాష్, దండు శేఖర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

c m y k

బీఆర్ఎస్‌ను ఓడించాలి

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షబ్బీర్ అలీ



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి కేసీఆర్ రాజకీయ జీవితానికి చమర గీతం పాడాలని నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షబ్బీర్ అలీ అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని గాయత్రి నగర్‌లోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మహమ్మద్ షబ్బీర్ అలీ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే బడుగు బలహీన వర్గాల ప్రజల బతుకులు బాగు పడతాయని అయన తెలిపారు. విశ్వబ్రాహ్మణులు తరతరాలుగా కులవృత్తి చేపడుతున్నా వారి పరిస్థితులు మారలేదని అన్నారు. శ్రీకాంతాచారి బలిదానాలపైన గద్దె ఎక్కిన వాళ్లు గొట్టం గాళ్లు అంటూ కేటీఆర్ కించపరుస్తున్నారని తెలిపారు. అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పథకాలు పేరుకే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు.

కాంగ్రెస్ హయాంలో

తెలంగాణలో అంధకారం

- సోనియాకు దిక్కులేక రేవంత్ అనే దొంగకు పదవి
- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-ధర్పల్లి

కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రాంతం అంధకారంలో ఉండేదని, నిజామాబాద్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం అయన మండలంలోని రామడుగు, కేశారం, మైలారం, చల్లగర్గ, డీబీ తండా, దుబ్బాక, రేకులపల్లి, గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు బాధలు కేసీఆర్ వచ్చినాక తప్పాయని అన్నారు. ఆర్టీసీ ఆదాయం 6 కోట్లు ఉండగా చైర్మెన్‌గా 18 కోట్లకు పెంచిన ఘనత తనదని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. ఆర్టీసీ బస్సు సిబ్బందికి అడుగు ఆర్టీసీ అభివృద్ధి చెందిన విషయ గురించి అని అన్నారు. దిక్కులేక ఓటుకు నోటు దొంగకు టీపీసీసీ పదవిని సోనియా ఇచ్చిందని విమర్శించారు. కరోనా కష్ట కాలంలో ప్రజలను పట్టించుకోని వ్యక్తి ఎన్నికల సమయంలో వచ్చి నాకు ఒక్కసారి గెలిపించమని అడుగుతుండని భూపతి రెడ్డి



బాజిరెడ్డిని హారతులతో స్వాగతిస్తున్న మహిళలు

పై విమర్శలు ఎక్కు పెట్టారు. ప్రజలకు చేసిన మేలుని వివరిస్తే పథకాల లబ్ధిదారులే గెలిపిస్తారని అన్నారు. బంగారు గుడ్డు లాంటి మన కేసీఆర్ ప్రభుత్వం గెలిపించుకొని, ప్రతిరోజూ లబ్ది పొందాలని తెలిపారు. కొరట్ పల్లి నుండి పొట్యూర్ గుట్ట వయా మైలారం, దుబ్బాక, డబుల్ రోడ్డు త్వరలో చేయిస్తానని అన్నారు. అభివృద్ధి చేసిన కేసీఆర్ ప్రభుత్వం పై ప్రతి పక్షాలు ఎన్నికలు రాగానే బీజేపీ. కాంగ్రెస్ వాళ్ళు వచ్చి మేము ఇది చేస్తాం.. అది చేస్తామని బూటకపు హామీలు ఇస్తున్నారని అన్నారు. వారిని నిలదీయాలని తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో 10 వేల డబుల్ బెడ్ రూమ్ లు కట్టించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఈసందర్భంగా మైలారం గ్రామములోని సోమా శేఖర్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, సర్పంచులు సంగీత భాస్కర్, కర్రోళ్ల రమేష్, పోషన్న, నరేందర్, వెంకటేష్, రాజేందర్, సొసైటీ చెర్మన్ ధర్మయ్య గారి రాజేందర్ రెడ్డి, కోతి శేఖర్ రెడ్డి, నిమ్మల కిరణ్, గోవర్ధన్ రెడ్డి, నూకాల నర్సయ్య, ఎంపిటిసి స్వామి, పెండ గంగాధర్. మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం

- రూరల్ అభ్యర్థి భూపతిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బాడ్సి, సింగంపల్లి, కులాస్పూర్ తాలకుర్తి, బోర్గం (పి) తదితర గ్రామాలలో రూరల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డి, కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగ రెడ్డితో కలిసి గురువారం ప్రచారం నిర్వహించారు. ప్రజలు డీజే సౌండ్లతో పూలదండలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమని ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే రోజు దగ్గరలో ఉందని, డిసెంబర్ 9వ తారీకు సోనియాగాంధీ పుట్టిన రోజున తెలంగాణ కర్షక రైతు ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని ఆయన తెలిపారు. గిరిజనులకు పోడు పట్టాలు, కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ముంపు ప్రాంతమైన మంచిప్పవాసుల సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింద అన్నారు. ఎమ్మెల్యే ధనార్జన దేయంగా హైదరాబాద్ జిల్లాలు చుట్టుపక్కల విల్లాలు, గ్రామాలలో వందలు ఎకరాల భూములు పోగు చేసుకున్నాడని. ఇదంతా ప్రజాధనం దుర్వినియోగం చేయడం వలన సాధ్యమైందని విమర్శించారు.



ప్రచారంలో మాట్లాడుతున్న భూపతిరెడ్డి

మండలంలోని కులాస్పూర్ గ్రామాన్ని ఒకప్పుడు తాను దత్త తీసుకున్నానని, అందులో భాగంగా కొన్ని నిధులు మంజూరు చేశానని. గ్రామ అభివృద్ధిలో తోడ్పాటు అయ్యానని, ఈ గ్రామంతో తనకున్న అనుబంధం చాలా గొప్పదని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో చేపట్టిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, సౌభాగ్య లక్ష్మీ పథకము సిలిండర్ 500 రూపాయలకు అందిస్తామని, 5 లక్షల నుండి 10 లక్షల కూడా ఆరోగ్యశ్రీ పథకం పెంపొందిస్తామని ఆయన తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి తీరుతానని, ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి ఒక్క గ్రామాన్ని సందర్శించి గ్రామానికి కావాల్సిన వసతులు ఏర్పాటు చేస్తానని అన్నారు. మీ అమూల్యమైన ఓటు నాకు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ముప్ప గంగిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అని అన్నారు. ప్రతి ఒక్కరం భూపతిరెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని తెలిపారు. ఎమ్మెల్సీ పదవి కూడా కేసీఆర్ విధానాలు నచ్చక వదులుకున్నాడని అన్నారు. అటువంటి గొప్ప వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని తెలిపారు. ఇక్కడున్న ఎమ్మెల్యే ఎంత సేపు తన ఆస్తులను కాపాడుకోవడం పెంచుకోవడం తప్ప తాను చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నా కూడా కులాస్పూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేదంటే సిగ్గు పడాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ రెండు లక్షలు చేసి తీరుతామని ఆయన తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి, శేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, మాజీ పిండో చైర్మన్ సూర్య రెడ్డి, కిరణ్ రావు మాజీ మండల అధ్యక్షుడు బున్నే రవి. సాయి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిగాల సతీమణి ప్రచారం

నవతెలంగాణ-కంఠేశ్వర్



బీఆర్ఎస్ పార్టీ నిజామా బాద్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల గెలుపు కోసం వారి సతీమణి లత బిగాల 6వ డివిజన్ వినాయక్ నగర్ లో గురువారం ఎన్నికల ప్రచా రం నిర్వహించారు.కారు గురు కి ఓటు వేసి గణేష్ బిగాలని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

టెక్నాలజీతో ప్రచారం నిఘా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

4జీ నెట్‌వర్క్‌తో ప్రైవేటు ఉద్యోగులు డ్యూటీ ఎక్కడ చేశారు..? ఏ ప్రాంతాల్లో చేశారు..? ఏ సమయం నుంచి.. ఏ సమయంలో చేశారు..? ఒకరోజు (ఎన్ని కాల్స్) ఎంత మందిని కలిశారు. కలిసిన వారి నుండి (ఎటువంటి స్పందన) ఎటువంటి ఫలితం వచ్చిందా.. అనే అంశాలను ప్రైవేటు ఉద్యోగులు ఎప్పటికప్పుడు పైన ఉన్న ఉద్యోగులకు తెలియజేయాల్సిన అవసరం ఏర్పడింది. అదే విధంగా ఇప్పుడు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఇవే నియమ నిబంధనలను పాటిస్తూ. కార్యకర్తలు ఏ విధంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఎక్కడెక్కడ కొనసాగిస్తున్నారు...? ఏ ఓటర్లకు ప్రచారం చేస్తున్నారు... ఏ ప్రాంతంలో చేస్తున్నారు... వారికి మన పార్టీ గుర్తుకు సంబంధించిన ఏమైనా సమాచారం అందించారా... మన పార్టీకి సంబంధించిన పాంప్లెంట్ అందించారా... వారికి మన పార్టీ గురించి ఏ విధంగా వివరించారు... అనే అంశాలను పరిశీలిస్తున్నారు. డివిజన్ వారిగా, గల్లీలలో తిరుగుతున్న ప్రతి నాయకుడు వారి దగ్గర ఉన్న ఫోన్‌లో ఫోటోని, వీడియోని తీసి వారు ప్రచారానికి వెళ్లిన డివిజన్ వాట్సాప్ గ్రూప్‌లలో పోస్ట్ చేసి, అభ్యర్థులకు తెలిసే విధంగా, ఆ వాట్సప్ గ్రూపులను అబ్జర్వ్ చేసి, కార్యకర్తలకు దగ్గర నుండి సమాచారాన్ని తెలుసుకుంటూ, కార్యకర్తలు, ప్రచారంలో వెళ్ళిన వారికి వారితో పాటు వెళ్లిన ప్రచార కార్యకర్తలకు రోజు నిమిత్తం 300 నుంచి 500 వరకు డబ్బులను చెల్లింపు చేస్తున్నారా.. ప్రచారం చేయకుండా డబ్బులు అడిగినా ఎవరికి చెల్లించడం లేదు.. ఈ విధంగా ప్రతి ఒక్క పార్టీ 4జీని వాడుకుంటున్నాయి.

ప్రతీ సమస్యపై కొట్లాడుతా

- ఓటు వేసి గెలిపించండి
- బీఎల్ఎఫ్ కామారెడ్డి అభ్యర్థి సిరిగాద సిద్ధిరాములు



నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజలకొచ్చే ప్రతి సమస్యపై ముందుండి కొట్లాడుతానని, తనకు ఓటు వేసి గెలిపించాలని కామారెడ్డి బీఎల్ఎఫ్ అభ్యర్థి సిరిగాద సిద్ధిరాములు అన్నారు. గురువారం కామారెడ్డి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో పర్యటించి కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తన వెంట జీవిత భాగస్వామి సిరిగాద సబిత, బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు యం.ఆంజనేయులున్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే స్వగృహం అంకాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్ రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు, కార్యకర్తలతో పాటు పలుకులసంఘాలవారు గురువారం గులాజీ కండువా కప్పుకున్నారు. మాక్లూర్ మండలం నుంచి మాణిక్ బండార్‌కు చెందిన ఎస్సీ మాల సంఘ సభ్యులు, మాదిగ సంఘ సభ్యులు. క్షత్రియ సమాజ్ ప్రతినిధులు, మాణిక్ బండార్‌కి చెందిన పద్మశాలి సంఘ సభ్యులు. ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామానికి చెందిన రజక సంఘం సభ్యులు, వందలాదిమంది యువకులు, ఫత్తేపూర్ గ్రామానికే చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, నాయకపోడు సంఘం సభ్యులు, మిత్ర సంఘం సభ్యులు. గౌడ, వడ్డెర సామాజిక వర్గాలకు చెందిన ముఖ్య నేతలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు.



సబ్బండ వర్గాలకు మేలు చేస్తున్న కేసీఆర్ పాలనపై ఉన్న నమ్మకంతోనే తామంతా బీఆర్ఎస్ లో చేరినట్టు వారు తెలిపారు. తామంతా జీవన్ రెడ్డిని గెలిపిస్తామని గులాబీ గూటికి చేరిన వివిధ సంఘాల ప్రతినిధులు మీడియాకు తెలిపారు.

మద్దతు తెలిపిన క్షత్రియ సమాజ్

నియోజకవర్గ క్షత్రియ కులస్తులు తమ పూర్తి మద్దతు బీఆర్ఎస్ పార్టీకే అని తెలిపి ఏకగ్రీవంగా తీర్మానం ప్రకటించారు. తీర్మాన పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ బాలకిషన్ ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో బాల్కొండ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నామని మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, మైనారిటీ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్.వహాబ్ గురువారం తెలిపారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రతీ ఇంటికి ప్రతీ గడపకు అందిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బాల్కొండ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి వేముల ప్రశాంత్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

నవతెలంగాణ

యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి

యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన ఎంభేరి లింబాద్రి (29) భూ వివాదాలతో పాటు, వడ్ల కొనుగోలు కేంద్రంలో జరిగిన గొడవతో మనస్థాపం చెంది సొంత పొలంలో భార్యకు ఫోన్‌చేసి చేసిన అనంతరం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న సర్పంచ్, జెడ్పీటీసీ

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో జడ్పీటీసీ శంకర్ నాయక్, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ మాట్లాడుతూ కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలోనే ఏరాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేశారని గుర్తు చేశారు. కారుగుర్తుకు ఓటువేసి సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల ప్రజలను కోరారు.

సూపర్ మార్కెట్ యాజమానిపై దాడికి ప్రయత్నం

- పువ్వులు తక్కువ ధరకు ఎలా విక్రయిస్తావని దబాయించినట్టు వెల్లడి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల కామాక్షి సూపర్ మార్కెట్ యజమానిపై కామారెడ్డి పట్టణంలోని పూల దుకాణ యజమానులు గురువారం తక్కువ ధరకు పూలు విక్రయిస్తున్నామంటూ దాడి చేయడానికి ప్రయత్నం చేశారు. పోలీసులు రావడంతో తాను తన మార్కెట్లో పనిచేసే సిబ్బంది రక్షింపబడ్డామని కామాక్షి సూపర్ మార్కెట్ యజమాని సతీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూపర్ మార్కెట్ యజమాని మాట్లాడుతూ తాను పూలు అమ్మేది లాభం కోసం కాదని దేవుని పూజ కోసం పూల అమ్ముతున్నానని దాంట్లో కూడా కమిషన్ తీసుకొని అమ్మాలంటే దేవునిపై వ్యాపారం చేసినట్లు అవుతుందని, తాను కొనుగోలు చేసిన ధరకు రవాణా చార్జి కలుపుకొని విక్రయిస్తున్నానన్నారు. ఎవరి వ్యాపారం వారిదేనని వారు కూడా నేను ఇచ్చే ధరలకే విక్రయించవచ్చు కానీ అలాకాకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని పూల వ్యాపారులు తనపై దాడికి ప్రయత్నం చేశారన్నారు. ఇదిలా ఉండగా.. ఘర్షణ పడిన ఇరువురు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

బీఆర్ఎస్ నాయకులు గురువారం ఎల్లారెడ్డి పట్టణంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. చేరిన వారిలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అఫ్రోజ్, విద్యార్థి విభాగం అధ్యక్షులు సిహెచ్ రవి, ధర్మారం శ్రీశైలం, ఒంటరి నరసారెడ్డి, తదితరులు చేరారు. కార్యక్రమంలో నాయకులు అంబాయి ప్రసాద్, మేదర్ గోపి, గొల్లపల్లి కిషన్ యాదవ్, నామాల రాములు, తదితరులున్నారు.

ప్రజాసేవ కోసమే

రాజకీయాల్లోకి వచ్చా

- కేసీఆర్ హాయంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హనుమంత్ షిండే



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నవతెలంగాణ-మద్నూర్

ప్రజాసేవ కోసమే ఇంజనీర్ ఉద్యోగాన్ని వదులుకొని రాజకీయాల్లోకి వచ్చానని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హనుమంతు షిండే తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత గడిచిన 10 సంవత్సరాల కాలంలో కేసీఆర్ ముఖ్యమంత్రి హాయంలో రాష్ట్రం ఎంతో పురోగతి చెందిందని.. మన రాష్ట్ర అభివృద్ధిని చూసి పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక ప్రజలు గొప్పగా కొనియాడుతున్నారని పేర్కొన్నారు. గురువారం పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్‌గా కొనసాగుతుందని అన్నారు. ప్రజలు సంక్షేమ ఫలాలను ఇంటింటికి లబ్ధి పొందుతున్నారని ఈసారి జరిగే ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేసి మళ్లీ బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈసారి అధికారంలోకి వస్తే సౌభాగ్యలక్ష్మి పేరుతో ప్రతి ఇంటికి అర్హులైన మహిళకు నెలకు 3000 రూపాయల చొప్పున అందిస్తామని, గ్యాస్ సిలిండర్ 400కే అందిస్తామని, కెసిఆర్ బీమా అమలు చేస్తామన్నారు. రాచూర్ సర్పంచ్ పార్వతి శంకర పటేల్, చిన్నఎక్లారా సర్పంచ్ భీమ్రావు, కొడిచెర గ్రామపెద్దలు వీరయ్యప్ప, మద్నూర్ గ్రామంలో సర్పంచ్ సురేష్, మండల అధ్యక్షులు బన్ని పటేల్, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, యూత్ మండల అధ్యక్షులు సుధాకర్ పటేల్, మైనార్టీ నాయకులు మోహిన్ పటేల్, గఫర్ బాబు, ఎంకే పటేల్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ దిగంబరావ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ నీరడీ సాయిలు, శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారాన్ని నిర్వహించారు. 6 గ్యారంటీ పథకాలను వారికి వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రొద్దుటూరు సుదర్శన్‌రెడ్డిని చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వారు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవిదాస్, మాజీ సర్పంచ్ జంగం గంగయ్య, లక్ష్మణ్, సాయిలు, శ్రీనివాస్ పోతున్న, మోతిరామ్ తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఇందిరాదేవి ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్ రెడ్డిని చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీ పథకాల గురించి వివరించారు. ఆమె వెంట మహిళా కార్యకర్తలతో పాటు సోషల్ మీడియా ఇన్చార్జ్ సయ్యద్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ పరామర్శ

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన విశ్వనాథులు అంజయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిన వెంటనే మాచారెడ్డి జెడ్పిటిసి మినుకూరి రామిరెడ్డి అంజయ్య ఇంటికి వెళ్లి అతని ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయన వెంట వివిధ గ్రామాల సర్పంచులు, బిఆర్ఎస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, యువ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

అభివృద్ధి చేస్తా..

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్‌రావు



మాట్లాడుతున్న మదన్ మోహన్‌రావు

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, ఈ ఎన్నికల్లో ఒకసారి అవకాశం కల్పించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు ఓటర్లకు సూచించారు. గురువారం మండలంలోని కొండాపూర్, ముంబాజిపేట్ తండా, భవానిపేట్, రాంపూర్, బాణాపూర్, బాణాపూర్ తాండ, కోర్పుల్, నల్లమడుగు, లింగంపల్లి, లింగంపల్లి తాండ, రాంపల్లి స్కూల్ తండా, రాంపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకసారి అవకాశం కల్పించి అసెంబ్లీకి పంపాలని ఆయన ఓటర్లను కోరారు. నియోజకవర్గంలోని బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేయడానికి తాను ఎన్నికల బరిలో నిలిచినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో అభివృద్ధి వెనుకబడిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అభివృద్ధి చెందారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకకాలంలో రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశాడని అన్నారు. రుణమాఫీ విడతల వారీగా చేయడం వల్ల మాఫీ డబ్బులు మిత్తికి సరిపోయినట్లు వెల్లడించారు. రైతులను నట్టేట ముంచింది బీఆర్ఎస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రూపాయలు ఏకకాలంలో మాఫీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం నిరుపేదలకు ఒకరికి కూడా రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం తనకు వచ్చే వేతనంలో నుండి కేవలం ఒక రూపాయి మాత్రమే తీసుకొని మిగిలిన డబ్బులు నిరుపేదల సంక్షేమానికి ఖర్చు చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు.

వ్యవసాయానికి నిరంతరంగా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వస్తే వ్యవసాయానికి కేవలం మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తారని దుష్ప్రచారం చేస్తున్నారని దానిని తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. నియోజకవర్గానికి అభివృద్ధి పనుల కోసం వచ్చే నిధుల నుండి ఒక రూపాయి కూడా కమీషన్ తీసుకోనని ఇప్పటికే బాండ్ పేపర్ రాసి ఇచ్చినట్లు గుర్తు చేశారు. తాను కమీషన్ తీసుకున్నట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వెల్లడించారు. గ్రామాల్లో ప్రచారానికి వెళ్లిన మదన్మోహన్ రావుకు మహిళలు ఘనస్వాగతం పలికారు. ముంబాజిపేట గ్రామంలో చిన్నారులు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గుర్రం కిష్టయ్య, పార్టీ నాయకులు నారాగౌడ్, ఎల్లమయ్య, కౌడ రవి, సాయికుమార్, గుర్రం కిష్టయ్య, గులాం భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన తాండూర్ సొసైటీ చైర్మన్

నాగిరెడ్డిపేట్ మండలం తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంబోజిపేటకు చెందిన బిజెపి, బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదగిరి రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బాన్సువాడ ఎక్సైజ్ శాఖ డివిజన్ పరిధిలో మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసిం ది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు డివిజన్‌లో 98 కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశామని బాన్సువాడ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యాద´గిరి రెడ్డి తెలిపారు. బాన్సువాడ డివిజన్ పరిధిలో 16,478 లీటర్ల కల్లును ధ్వంసం చేసినట్టు తెలిపారు. 92.87 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. 120. 25 లీటర్ల బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నామని వివరిం చారు. 3.2 కిలోల గంజాయిని పట్టుకున్నామని, ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.17లక్షల 20వేలు వరకు ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనాలు, కారు, ఇతర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ యాదగిరి రెడ్డి తెలిపారు.

నిరంతరం నిఘా పెట్టాం

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రభావి తం చేయడానికి మద్యం వినియోగించే అవకాశం ఉందని, అభ్యర్థులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఎక్సైజ్ శాఖ ని రంతరం ప్రత్యేక బృందాలతో నిఘాపెట్టి కట్టడి చేస్తున్నా మని తెలిపారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు కృషిచేస్తున్నామని ఆయన వివరించారు.


అక్రమ మద్యం పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

నసురుల్లాబాద్ మాజీ ఎంపీటీసీ మృతి

నవతెలంగాణ-నసురుల్లాబాద్



నసురుల్లాబాద్ మండలం కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ డి.మల్లేశంగౌడ్(56) ఆకస్మికంగా మృతి చెందారు. ఇటీవల స్వల్ప అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. 2002లో నసురుల్లాబాద్ గ్రామ ఎంపీటీసీగా ఐదు సంవత్సరాలు పదవి చేపట్టారు. అనంతరం సర్పంచ్, ఎంపిటిసి అభ్యర్థిగా పోటీచేసి సల్ప మెజారిటీతో ఓడిపోయారు. గ్రామాభివృద్ధి కమిటీలో కుల సంఘం కమిటీలో పని చేశారు. మల్లేశంగౌడ్ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి సుదర్శన్ రాజ్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బోధన్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి సుదర్శన్ రాజుపై రెంజల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎంఏ అజార్ వీరన్నగుట్ట శివారులో అర ఎకరం భూమిని కొనుగోలు చేయగా, రోడ్డు బోండ్రిలో రిటైర్డ్ ఎస్సై సుదర్శన్ రాజ్, అతని కుమారుడు సందీప్ రాజ్ తన భూమికి దారి ఇవ్వకుండా టీం షెడ్డును ఏర్పాటు చేశారని, తన పొలానికి వెళ్లడానికి దారి ఇవ్వమని అడిగితే చంపుతా మని బెదిరిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సాయన్న 151/2022లో యుఎస్/341, 290, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలోని పలు వార్డులలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గంగాకృష్ణ ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 6 గ్యారంటీ పథకాలకు ప్రజలు ఆకర్షితులై ముందుకు వస్తున్నారని, ఈనెల 30న జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.సుదర్శన్ రెడ్డి ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. ఆయన వెంట వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు సద్దాం, గ్రామ కమిటీ అధ్యక్షులు సోక్కుల సాయిలు, గంగాకిషన్, మైనార్టీ మండల అధ్యక్షులు షేక్ షహబాజ్, మునీర్, బేగరి గంగాధర్, నేటి విభాగం అధ్యక్షుడు మారా వెంకటేష్, పాశం లక్ష్మి, కటికల నిర్మల, జునేత్, సమీర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుఢీకొనడంతో ఇద్దరికి గాయాలు

- నసురుల్లాబాద్‌లో ఘటన

నవతెలంగాణ-నసురుల్లాబాద్

శుభ కార్యక్రమానికి బైకుపై వెళ్తున్న ఇద్దరికీ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన సంఘటన గురువారం మధ్యాహ్నం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువ మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. రుద్రూర్ గ్రామానికి చెందిన భూలక్ష్మి, సాలూర గ్రామానికి చెందిన సాకలి తుకారంలు కలిసి రుద్రూర్ నుంచి బైరాపూర్ వస్తుండగా. ఆర్టీసీ బస్సు బాన్సువాడ నుంచి వర్ని వెళుతుండగా నిజాంసాగర్ కాలువ మూలమలు పు వద్ద ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు సైకిల్ మోటార్ ఢీకొనడంతో సైకిల్ మోటార్ పై వస్తున్న భూలక్ష్మి, తుకారం లకు తీవ్ర గాయాలు అయ్యాయి . మూల మలుపు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న నసురుల్లాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువురి పరిస్థితి విషమించ డంతో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు నసురుల్లాబాద్ ఎస్సై లావణ్య, ఏఎస్ఐ వెంకట్రావు, సిబ్బంది ఖాజా తదితరులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బస్సు ఢీ కొనడంతో గాయాలపాలైన క్షతగాత్రులు

భారీగా మద్యం స్వాధీనం

- కేసు నమోదు

నవతెలంగాణ-భిక్కనూర్



రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఒక వైపు ప్రచారం జోరుగా సాగుతుంటే.. మ రోవైపు డబ్బులు, మద్యం భారీ మొత్తంలో పోలీసులు స్వాధీనం చేసుకుంటు న్నా రు. భిక్కనూరు పట్టణ కేంద్రంలో గురువారం భారీ మొత్తంలో మద్యం స్వాధీనం చేసుకు న్నారు. వివరాలు ఇలా ఉన్నా యి పట్టణ కేంద్రంలో ఉన్న వైన్స్ షాప్ నుంచి 18 కాటన్ల మద్యం బాటిల్లను పట్టణానికి చెందిన ఓ ప్రజాప్రతి నిధి ఇంటికి తరలిస్తుండగా గమ నించిన బిజెపి నాయకులు పోలీ సులకు సమాచారం అందించారు. ఎన్నికల సమయం లో భారీ మొత్తంలో మద్యం ప్రజాప్రతినిధి ఇం టిలో ఏ విధంగా దాస్తారని బిజెపి నాయ కులు ప్రజాప్రతినిధి ఇంటిని ముట్టడించారు. పోలీసులు వచ్చి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకునే వరకు ప్రజాప్రతినిధి ఇంటి ముందే ఉండటంతో ప్రజాప్రతినిధికి, నాయకులకు మ ధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొ ని దా చి ఉంచిన 18 మద్యం కాటన్లను స్వా ధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ మేం´కు మద్యం విక్రయిం చిన వైన్స్ ఓనర్, త´రలిం చిన వ్యక్తిపై కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

కందకుర్తి ఎత్తిపోతలను పట్టించుకోవట్లే

- సాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం
- పలు గ్రామాల రైతులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయక నాలుగు నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎత్తిపోతల పథకం వద్ద వారు మాట్లాడుతూ.. గోదావరి నది ఒడ్డున ఉన్న ఈ ఎత్తిపోతల పథకం ద్వారా కందకుర్తి, పేపర్‌మిల్లు, నీలా గ్రామాలకు సుమారుగా 3,366 ఎకరాలకు నీరు అందించేదని వారు పేర్కొన్నారు. ఈ ఎత్తిపోతల పథకం ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండ´గా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడం లేదని, ఐదవ ట్రాన్స్‌ఫార్మర్‌కు డబ్బులు జమ చేసి మరమ్మతులు చేసుకున్నట్లు రైతులు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ఇటువైపు చూడడం లేదని, దీంతో తమ చేతికి వచ్చిన పంటలు ఎండు ముఖం పట్టాయని వారి పేర్కొన్నారు. గతంలో మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి హయాంలో సిమెంట్ పైపులకు బదులుగా స్టీల్ పైపులను వేయించి శాశ్వత పరిష్కారం చేశారని, ఇంతవరకు అధికారులు రాకపోవడం శోచనీయమని వారు పేర్కొన్నారు. రైతులు డబ్బులు జమ చేసుకొని మరమ్మత్తులు చేయించుకుంటున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుతం పొగాకు, శనగ పంట, నీలా గ్రామంలో వరి పంటకు సాగునీరు అత్యవసరమని, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు కల్పించుకొని ఎత్తిపోతల పథకాన్ని పున: ప్రారంభించాలని వారు పేర్కొన్నారు. రైతులు పురాన్ బేగ్, ఏకార్ బేగ్, అజ్మత్ ఖాన్, అయ్యుబ్ బేగ్, షకీల్ బేగ్, హిమాయత్ బేగ్, సలీం బేగ్, అన్సర్ బేగ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పలు గ్రామాల రైతులు

ఉరేసుకొని ఒకరు ఆత్మహత్య

- ఆత్మహత్యపై పలు అనుమానాలు

నవతెలంగాణ-కోటగిరి



ఉరేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన నాచుపల్లి చిరంజీవి (25) పోతంగల్ మండలంలోని టాక్లి గ్రామ శివారులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఈ నెల 22న ఉదయం సుమారు 9 గంటలకు చిరంజీవి నిజామాబాద్ ఆసుపత్రికి వెళతానని చెప్పాడు. కాగా సాయంత్రం పోతంగల్ మండలం టాక్లి గ్రామ శివారులో ఉరి వేసుకున్నట్టు సమాచారం అందింది. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ మరణం విషయంలో అనుమానం ఉందని భార్య ఫిర్యాదు చేయగా.. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాదారావ్ దేశాయి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గురువారం మండలంలోని ఖండేబల్లూర్, లింగంపల్లి, సావర్‌గావ్, డొన్గాం, బాబల్‌గావ్, జుక్కల్ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే హన్మంత్ షిండే చేసిన అభివృద్ధి పనులను చూసి ఓటేయ్యాలని అన్నారు. మండలంలోని తొంబై శాతం గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించారని, గ్రామాల అభివృద్ధికి కృషి చేసి రూపురేఖలు మార్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్ దేశాయి, హన్మారెడ్డి, షెక్ రఫీ, శ్రీనివాస్, లక్ష్మన్, రహిమాన్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు

బీఆర్ఎస్‌లో సేవ రాజకీయాలు లేవు

- మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన సంగమేశ్వర్

నవతెలంగాణ-మద్నూర్

బిఆర్ఎస్ పార్టీలో సేవా రాజకీయాలు లేవని వ్యాపార రాజకీయాలే కొనసాగుతున్నాయని ఇలాంటి రాజకీయాలు నచ్చకనే మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు సంగమేశ్వర్ తెలిపారు. గురువారం రాత్రి తన సొంత గ్రామమైన కొడిచెర గ్రామంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. పార్టీలో 20 సంవత్సరాల కాలంగా పార్టీ సేవ కోసమే పనిచేస్తున్నానని, ప్రస్తుతం పార్టీలో సేవా రాజకీయాలు లేకుండా పోయాయని వ్యాపార రాజకీయాలుగా మారాయని తెలిపారు. పార్టీలో రాజకీయ అవకాశాలు ఇవ్వలేకనే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇటు పార్టీకి అటు ఎమ్మెల్యేకు నావల్ల నష్టం జరగకూడదు అనే ఉద్దేశంతో పదవిని అడ్డం పెట్టుకొని రాజకీయంలో ఉండకూడదని ఆలోచనతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో కార్యకర్తలకు ఎలాంటి ఘటనలు వచ్చిన ఎమ్మెల్యే హనుమంతు షిండే మౌనంగా ఉండడం వ్యాపార రాజకీయాలకు తావిస్తుందని సేవా రాజకీయాలు ఉండాలి కానీ వ్యాపార రాజకీయాలు కొనసాగుతున్నందున పార్టీ సిద్ధాంతాలు నచ్చకనే ఏఎంసీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా ఎల్లవేళలా సేవలు అందిస్తానని తెలిపారు.

కండువా సరే..
ఓటు మనకేనా..?



- ఎమ్మెల్యే అభ్యర్థులకు అనుమానం
- చేరికలతో మారుతున్న కండువాలు
- అంతుచిక్కని ఓటరు నాడి

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. ఒకరికి మించి మరొకరు పార్టీ నాయకులు, ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థులు కుల సంఘాలను పార్టీలో చేర్చుకోవడం, కండువాలు మార్చడం జోరుగా సాగుతుంది. బలమైన నాయకులకు, కుల సంఘం అధ్యక్షులను పార్టీలోకి ఆహ్వానించి కండువాలు మార్చుతున్నారు. పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తల సంఖ్య పెరిగితే అంత భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని కుల సంఘాలకు, సంఘం అధ్యక్షులకు, ప్రజాప్రతినిధులకు ఆఫర్లు అందజేస్తూ పార్టీలో చేర్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. కండువా వేసుకున్నంత మాత్రాన.. ఓటు మనకే వేస్తారా? లేదా? అన్న అనుమానం అభ్యర్థుల్లో వెంటాడుతోంది.

అంతు చిక్కని ఓటరు నాడి..

గతంలో ఎన్నికల సందర్భంగా మన కులస్తులు, స్థానికులు, ఆపద సమయంలో ఆదుకున్న వాళ్లు ఎటు వైపు వెళితే అటు ఓటు వేయడం జరిగేది. కానీ ప్రస్తుత సమయంలో ఏ అధ్యక్షుడు ఎటువైపు వెళ్లిన, ఎన్ని ఆఫ ర్లు ఇచ్చి కుల సంఘాలను, ప్రజాప్రతినిధులను పార్టీ లోకి చేర్చుకున్నా.. చేరిన వారు చెప్తే ఓటర్లు ఓటు వేసే పరిస్థితి కనబడడం లేదు. ఎవరు ఎన్ని చెప్పినా, కండువాలు మార్చుకున్న తమకు నచ్చిన వారికి మాత్రమే ఓటు వేయాలని ఓటర్లు బలంగా ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది.

కండువా ఉంటే ఓటు మనకేనా..?

గ్రామాలలో, పట్టణాలలో అభ్యర్థిని గెలిపించడం కోసం పార్టీ కండువాలు వేసుకొని జోరుగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారం ఏ విధంగా ఉన్న ప్రచారం చేసిన, చేస్తున్న పార్టీ నాయకులు ఆ పార్టీకే ఓటు వేస్తారా..?, పార్టీలో చేరిన వారంతా మన పార్టీ వాళ్లేనా..?, అనే అనుమానం ఇటు నాయకులను వెంటాడుతోంది. కొన్నిచోట్ల ప్రచారంలో తిరిగితే డబ్బులు వస్తాయన్న ఆశతో కండువా వేసుకుని ప్రచారం చేస్తే, ప్రచారంలో పాల్గొనకపోతే ఏమంటారోనన్న భయంతో కండువాలు వేసుకుని ప్రచారం చేస్తున్నారు.

ఏది ఏమైనప్పటికీ సంఖ్యా బలం ఎక్కువగా ఉండి ప్రచారం చేసినా, సంఖ్యా బలం తక్కువగా ఉండి ప్రచారం చేసినా ఓటరు నాడి పట్టడం చాలా కష్టంగా మారింది. ఏ పార్టీ వాళ్లు పిలిస్తే ఆ పార్టీలోకి వెళ్లి ప్రచారం చేయడం, ఎవరు ఏ కండువా వేసుకోమంటే ఆ కండువా వేసుకొని సమావేశాలకు, సభలకు వెళ్లిన వచ్చిన వాళ్లు, ప్రచారం చేసిన వాళ్లు తప్పకుండా ప్రచారం చేసిన వాళ్లకే ఓటు వేస్తారన్న గ్యారెంటీ లేదు. ఓటర్లను ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా.. నచ్చిన వారికి ఓటు వేయాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.

చిరుజల్లులతో..
రైతులు ఆగమాగం

- కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం

నవతెలంగాణ-సదాశివనగర్

వానకాలం పంట చేతికిరావడంతో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచారు. అయితే గురువారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృత్తమై ఉంది. సదాశివనగర్ మండలంలోని పద్మాజీవాడి ఎక్స్ రోడ్డులో చిరుజల్లులు సైతం కురిశాయి. దీంతో ధాన్యం ఆరబెట్టిన రైతులు ధాన్యాన్ని కప్పేందుకు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే తరలించాలని కోరుతున్నారు.



నాటుసారా స్థావరాలపై
పోలీసుల దాడి

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-రామారెడ్డి



నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడిచేశారు. "తండాల్లో సారాయి జోరు" అనే శీర్షికన నవతెలంగాణలో గురువారం కథనం ప్రచురితమవడంతో ఎక్సైజ్ పోలీసులు స్పందించారు. మండలంలోని స్కూల్ తండా పరిధిలో ఎక్సైజ్, స్థానిక పోలీసులు కలిసి నాటు సారా స్థావరాలపై దాడి చేసి, సారాను తయారు చేసే పానకాన్ని ధ్వంసం చేశారు. తాండాకు చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ విక్రం తెలిపారు. సీఐ విజయ్ కుమార్, స్థానిక ఎస్సై సుధాకర్, సిబ్బంది తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

పోడు పట్టాలిప్పిస్తా

- ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్

నవతెలంగాణ-సదాశివనగర్



ప్రచారంలో మాట్లాడుతున్న జాజాల సురేందర్

అర్హులకు పోడు పట్టాలిప్పిస్తానని ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన స్థానిక వ్యక్తినని తెలిపారు. 22వ ప్యాకేజీలో భూములు కోల్పోయిన రైతులకు డబ్బులు రానివారికి డబ్బులు ఇప్పిస్తానని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి స్థానిక నాయకులు కాకుండా వేరే ప్రాంతం వారితో ప్రచారం చేయడం స్థానికంగా ఉన్న కార్యకర్తలపై నమ్మకం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భూమి లేని పేదలకు బీమా సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. నేను మీకు సేవచేయడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వివరించారు. మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా ఉత్నూర్‌లో భోనాలతో మహిళలు స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ మంత్రి నేరెళ్ళ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, ఎం.పి.పి గైని అనుసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్‌లు, ఎం.పి.టి.సి.లు, సొసైటీ చైర్మన్‌లు ప్రభాకర్ రావు, కమాలకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'మోగింది నగారా'
పాటల సీడీ ఆవిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డి

కవి, రచయిత ఎనిశెట్టి గంగాప్రసాద్ రాసి నిర్మాణం చేసిన ఓటరు చైతన్య గీతల 'మోగింది నగారా' పాటల సీడీని సీనియర్ సిటిజన్స్ ఫోరం కామారెడ్డి కార్యాలయంలో ఫోరం ప్రధాన కార్యదర్శి రాజన్న, తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో తమ ఓటును ప్రజలు అమ్ముకోకుండా నిజాయితీగా ఓటు వేయాలని తెలియజేసే ఓటర్లను చైతన్యపరిచే గీతాలను రూపొందించారని తెలిపారు. ఇవి చైతన్య ప్రబోధాలుగా ఉపయోగపడతాయని అన్నారు. ఈ పాటలను జి.సంధ్య, గాడి మంజుల పాడారని, జి.ఎల్.నాందేవ్ సంగీతాన్ని అందించారని వివరించారు. ఈ సందర్భంగా గంగా ప్రసాద్‌ను సన్మానించారు. ఈ పాటలను యూట్యూబ్‌లోనూ చూడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో తెరవే ప్రధాన కార్యదర్శి మోహన్ రాజ్, గాయకులు జి.సంధ్య, గాడి మంజుల, సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రాక్టికల్స్
పరిశీలించిన డీఐఈవో

నవతెలంగాణ-కోటగిరి



మండల కేంద్రంలోని జిల్లా గ్రామీణ బ్యాంకులో కోటగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులో భాగంగా బ్యాంకులో కార్యకలా పాల పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా దానికి సంబంధించిన వివరాలను డీఐఈవో రఘురాజ్ గురువారం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అధ్యాపకులు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



మండల కేంద్రంలో గురువారం డి.ఎస్.పి జగన్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల సందర్భంగా మండలంలోని ప్రజలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీఐ కృష్ణా, ఎస్ఐ కోనారెడ్డి, ఏఎస్ఐ రాములు, పోలీసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడించాలి

- టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు

నవతెలంగాణ-కామారెడ్డి

ఉద్యోగాలు లేక నిరుద్యోగుల ఆత్మహత్య లు చేసుకుంటుంటే ప్రభుత్వ ఉద్యోగుల వయో పరిమితిని 61 ఏళ్లకు పెంచిన బీఆర్ఎస్‌ను ఓడించాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి డాక్టర్ బాలు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును 58 నుండి 61 సంవత్సరాలకు పెంచడం అంటే బిఆర్ఎస్ ప్రభుత్వానికి నిరుద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. కామారెడ్డి నియోజక వర్గంలో కెసిఆర్ ఓడిపోవడం తథ్యమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని ఎందుకు పెంచారో కామారెడ్డి నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ గంప గోవర్ధన్ తెలియ జేయాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది ఉద్యోగాలను తెలంగాణ నిరుద్యోగులు కోల్పోతారని, ఇలాంటి దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలని లేకపోతే రానున్న రోజుల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఉండవని అన్నారు. రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు గడిచినా ఉద్యోగ క్యాలెండర్‌ను వెయ్యలేని అసమర్థ బిఆర్ఎస్ ప్రభుత్వమని, తెలంగాణ రాష్ట్రం వస్తే లక్షలాది ఉద్యోగాలు వస్తాయని మాట మాయమాటలు చెప్పి ఆత్మహత్యలు చేసుకునేలా చేసిన కేసీఆర్ కుటుంబానికి తగిన బుద్ధి చెప్పాలని కామారెడ్డి నియోజకవర్గ ప్రజలకు నిరుద్యోగులకు విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో ఎన్నికల ప్రచార జోరు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట్, రామారెడ్డి, ఉప్పల్వాయి, పోసానిపేట్, తోపాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా పార్టీలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆయా పార్టీల మేనిఫెస్టోను వివరిస్తూ తమ పార్టీకి ఓటేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కార్యకర్తలు